సాక్షి సంగారెడ్డి

బుధవారం : 4 : సెప్టెంబర్ : 2024



రియల్ దందా

పేదల కలను ఆసరాగా చేసుకున్న రియల్ వ్యాపారులు అన్ని రకాల హంగులతో వెంచర్‌లు ఏర్పాటు చేసి వారిని నిలువునా ముంచేస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఫార్మాసిటీ ఏర్పాటు వద్దు

ఫార్మాసిటీ ఏర్పాటును నిరసిస్తూ డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల భూ నిర్వాసితులు, రైతులు ఆందోళన చేపట్టారు.

వివరాలు 8లో ▸



నో రిపేర్.. నో వర్కింగ్

జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్‌రూం

సంగారెడ్డి క్రైమ్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రూపేష్ తెలిపారు. వరదల కారణంగా ఏమైనా ప్రమాదం ఏర్పడితే కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కు కాల్ చేయాలని సూచించారు. 24గంటలు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

రేపు జాబ్‌మేళా

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేది ఉదయం 11గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జేగ్రూప్ కంపెనీలో ఖాళీగా ఉన్న 990 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. వయసు 18 నుంచి 25 ఏళ్ల ఉండాలన్నారు. గురువారం పాత వెలుగు ఆఫీసులోని జిల్లా ఉపాధి ప్రాంగణ కార్యాలయంలో హాజరు కావాలని చెప్పారు. ఇతర వివరాలకు 08455–271010 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మట్టి గణపతులను ప్రతిష్ఠించుకుందాం


– ఎస్పీ రూపేష్



ఎస్పీ రూపేష్‌కు మట్టి గణపతిని అందిస్తున్న అనంత కిషన్

సంగారెడ్డి: వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని ఎస్పీ రూపేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేయబోయే ఉచిత మట్టి వినాయకులను ఎస్పీ అందించారు. సంస్థ అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సంస్థ ద్వారా 5016 మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, కొంపల్లి విద్యాసాగర్, కటకం విజయ్, నామ భాస్కర్, ఇరుకుల్లా ప్రదీప్, భక్త శ్రీనివాసులు, రాచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

వీడ్కోలు సభలో ట్రైనీ కలెక్టర్



విజయబాబు వీడ్కోలు సభలో ట్రైనీ కలెక్టర్ మనోజ్

సంగారెడ్డి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఏ.వి జయ్‌బాబు పదవీ విరమణ సన్మాన సభ స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ మనోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈఈ ఇంతియాజ్ అహ్మద్, కౌన్సిలర్లు వాసు, నాగరాజ్, యాకుబ్ అలీ, కూన సంతోష, రామప్ప, నాని పాల్గొన్నారు.

గుండువాగులో జారిపడిన వ్యక్తి

తాడు సహాయంతో కాపాడిన పోలీసులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలో ఓ వ్యక్తి ఉధృతంగా పారుతున్న గుండువాగులోకి ప్రమాదవశాత్తు మంగళవారం జారి పడిపోయాడు. పోలీసులు రెస్క్యూచేసి తాడు సహాయంతో కాపాడారు. మండలంలోని నల్లకుంటతండాకు చెందిన నంద్యానాయక్, విఠల్ నాయక్ చేపలు పట్టేందుకు గుండువాగు వద్దకు వెళ్లారు. వాగు పొంగిపొర్లుతుండడంతో నంద్యానాయక్ నీటిలో కొట్టుకుపోయి ఓ బండను పట్టుకొని ఆగాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే జిల్లా క్యూ ఆర్‌టీ సభ్యులు మహేశ్, శ్రీనివాస్, సురేశ్‌నాయక్, కానిస్టేబుల్స్ కృష్ణ, సురేశ్, మహేశ్ కలిసి నంద్యానాయక్‌ను కాపాడారు. వారిని ఎస్పీ, అల్లాదుర్గం సీఐ రేణుక, ఏఎస్ఐ దయానంద్ అభినందించినట్లు తెలిపారు.

ఎస్పీ అభినందన..

మెదక్ మున్సిపాలిటీ: తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వాగులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన క్యూఆర్టీ పోలీసులను ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అభినందించారు.

జలకళ



సంగారెడ్డి కలబ్ గూర్ శివారులోని మంజీరా డ్యామ్ వద్ద దిగువకు వదులుతున్న నీరు

నిండుకుండలా జలాశయాలు

- మత్తడి దుంకిన 117 చెరువులు
- వంద శాతం నిండిన చెరువులు 321..
- రెండు రోజుల్లో సింగూరుకు నాలుగు టీఎంసీలు
- ఇదే తీరుగా వరదదొస్తే రెండు రోజుల్లో పూర్తిస్థాయి నీటి మట్టం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. భారీగా వర్షం నీరు వచ్చి చేరడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. జిల్లా వ్యాప్తంగా 1,769 చెరువులు ఉండగా, 117 చెరువులు పూర్తిగా నిండి మత్తడి దూకాయి. 75 నుంచి వంద శాతం నిండిన చెరువులు 321 ఉన్నాయి. అలాగే 366 చెరువులు 50 నుంచి 75 శాతం నిండాయి. 25 నుంచి 50 శాతం నిండిన చెరువులు 844 వరకు ఉన్నాయి. 25 శాతం వరకు మాత్రమే నిండిన చెరువులు 121 ఉన్నాయి. భారీ వర్షాలకు మూడు నారాయణఖేడ్ డివిజన్‌లో మూడు చెరువులకు బుంగపడ్డాయి. వీటి పునరుద్ధరణకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

మూడోరోజు కూడా ముసురే..

జిల్లాలో వర్షం మూడో రోజు కూడా కొనసాగింది. రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వర్షం కురిసింది. సాయంత్రం వేళల్లో వర్షం కొంత విరామం ఇచ్చింది. అత్యధికంగా వట్‌పల్లిలో 3.03 సెం.మీల వర్షం పాతం నమోదైంది. కోహీర్‌లో 2.38 సెం.మీలు, అందోల్ (అన్నాసాగర్)లో 2.00 సెం.మీలు, పుల్కల్ (లక్ష్మిసాగర్)లో 1.58 సెం.మీలు, సంగారెడ్డి, కంది, మునిపల్లిల్లో 1.5 సెం.మీల చొప్పున వర్షపాతం రికార్డయింది.



సంగారెడ్డి టౌన్ : ఉధృతంగా ప్రవహిస్తున్న ఇస్మాయిల్‌ఖాన్ పేట వాగు

23 శాతం ఎక్సెస్ రెయిన్‌ఫాల్..

జిల్లాలో ఎక్సెస్ రెయిన్‌ఫాల్ నమోదైంది. ఈ వర్షాకాలం సీజన్‌లో.. అంటే జూన్ 1 తేదీ నుంచి ఈరోజు వరకు జిల్లా సాధారణ వర్షపాతం 521.5 మి.మీలు కాగా, సోమవారం నాటికి 641.4 మి.మీల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే సుమారు 23 శాతం ఎక్కువగా వర్షపాతం రికార్డు కావడం గమనార్హం.

21 టీఎంసీలకు చేరిన సింగూరు నీటిమట్టం

సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతుంది. నిన్నటి వరకు 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా, మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో 33,920 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రాజెక్టు నీటి మట్టం 21.536 టీఎంసీలకు చేరింది. ఈ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా మహారాష్ట్రలోని లాతూరు, బీడ్, ఉస్మానాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ ప్రాజెక్టుకు వరద రాక పెరిగింది. అలాగే జిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియాతో పాటు, కర్నాటకలో ఉన్న క్యాచ్‌మెంట్ ఏరియాలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ ప్రాజెక్టు నీటిమట్టం 17.298 టీఎంసీలు ఉండగా, మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 21.536 టీఎంసీలకు పెరిగింది. అంటే రెండు రోజుల్లోనే సుమారు నాలుగున్నర టీఎంసీల నీటి మట్టం పెరిగింది. ఇలాగే మరో మూడు రోజులు వరద వస్తే.. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని నీటిపారుదలశాఖ అధికారులు భావిస్తున్నారు.

అమీన్‌పూర్‌లో హైడ్రా దూకుడు

మున్సిపల్ చైర్మన్ అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజకీయ కక్ష సాధింపు చర్యలని చైర్మన్ ఆరోపణ

పటాన్‌చెరు: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో కబ్జాలకు గురైన చెరువులు, నాలాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. తాజాగా మంగళవారం అమీన్‌పూర్‌లో హైడ్రా హల్‌చల్ చేసింది. సర్వేనంబరు 462లోని ఆక్రమణలను అధికారులు తొలగించారు. అడ్డుకునేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, రెవెన్యూ, పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తాను గతంలో సర్వేనంబరు 461లో కొనుగోలు చేసిన భూమిని చూపాలని డిమాండ్ చేశారు. గతంలోనే తన భూమిని చూపాలని కోరుతూ సర్వే కోసం దరఖాస్తు చేశానని, నేటికీ అది పెండింగ్‌లో ఉందని వాదించారు. అక్రమంగా తన భూమిలోకి వచ్చి కూల్చివేతలకు పాల్పడటం కచ్చితంగా ఇది రాజకీయ దురుద్దేశమేనని వాదించారు. అయితే తాము చైర్మన్ భూమిని ముట్టుకోవడం లేదని కేవలం సర్వే నంబరు 462లో ఉన్న ప్రభుత్వ భూమిని మాత్రమే గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని తహసీల్దార్ పి.రాధ స్పష్టం చేశారు. చైర్మన్ దాదాపు 17 గుంటల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడని అధికారులు తేల్చారు. అందులోని నిర్మాణాలను కూల్చివేశారు. జేసీబీకి అడ్డుగా వెళ్లిన చైర్మన్‌ను పోలీసులు వారించి కూల్చివేతలకు ఉపక్రమించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నర్సింహ్మగౌడ్, కౌన్సిలర్లు కూడా చైర్మన్ పక్షాన అధికారులతో వాదించారు. అయితే పోలీసుల సహకారంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఫ్యూజన్ స్కూల్ పరిధిలోని కాంపౌండ్ వాల్, బాస్కెట్‌బాల్ కోర్టును తొలగించారు. ఆ భూమి సర్వే నంబరు 462లోనిదే అని తేల్చారు.

ఐలాపూర్‌లో కూడా..

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్ తండాలో సర్వే నంబర్ 119లో అక్రమంగా వెంచర్ వేశారనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు మంగళవారం ఉదయం అక్కడ కూల్చివేతలు నిర్వహించారు. ప్లాట్ల హద్దురాళ్ల తొలగించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న ప్రహరీలు, గదులను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఐలాపూర్‌లోని ప్రభుత్వ భూముల్లో క్రయవిక్రయాలు చేస్తే ఊరుకోమని అన్నారు.



రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న పాండురంగారెడ్డి



సర్వే నంబరు 462లో అక్రమ నిర్మాణాల తొలగింపు

వైభవంగా బోనాలు

పీఠాధిపతి పల్లకీ సేవ



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని చీలపల్లి–కుప్పానగర్ గ్రామ శివారులోని మల్లయ్యగిరి ఆశ్రమంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని సంఘం(కె), ఝరాసంగం, చీలపల్లి గ్రామాల మీదుగా ఆశ్రమం వరకు ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి బసవలింగ మహారాజ్ పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. చిలపల్లి గ్రామం నుంచి వివిధ తండాలవాసులు బోనాలు ఎత్తుకొని ఆశ్రమం వరకు తరలివెళ్లారు. అనంతరం బోనాలు సమర్పించి గట్టుపై ఉన్న శివలింగానికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆ గ్రామాలు.. ఇక మున్సిపాలిటీలు

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓఆర్‌ఆర్ పరిధిలోని గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ అమల్లోకి రానుంది. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూర్, ముత్తంగి, పాటి, పోచారం, ఘనపూర్ గ్రామాలు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోకి విలీనం కానున్నాయి. అలాగే అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్ గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోకి రానున్నాయి. ఇక నుంచి ఈ గ్రామాలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందాయని ప్రభుత్వం ఈ నెల 2న వెలువరించిన గెజిట్‌లో వివరించింది.

అధ్యయనం తర్వాత..

ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామాలను మున్సిపాలిటీల్లోకి విలీనం చేసే అంశంపై ప్రభుత్వం అధ్యయనం చేపట్టింది. జిల్లా స్థాయి కమిటీతో పాటు రాష్ట్రస్థాయి మంత్రుల సబ్ కమిటీ ఈ మేరకు గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేసే అంశంపై నిర్వహించిన అధ్యయనం తర్వాత ఈ గ్రామాలను మున్సిపాలిటీలోకి మార్చే ప్రక్రియ పూర్తి చేశారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని 45 గ్రామాలను వివిధ మున్సిపాలిటీల్లో విలీనం చేశారు.

అమీన్‌పూర్ మండలమే ప్రశ్నార్థకం

వడక్‌పల్లి, జానకంపేట మినహా అన్ని గ్రామాలు అమీన్‌పూర్ మున్సిపల్‌లో విలీనం కానుండటంతో అమీన్‌పూర్ మండలమే ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి అమీన్‌పూర్ గ్రామమే మున్సిపల్‌గా రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే.

అన్నీ జీహెచ్‌ఎంసీలోకే...

మున్సిపాలిటీల్లోకి విలీనమైన గ్రామాలన్నింటినీ జీహెచ్‌ఎంసీ పరిధిలోకే తీసుకువస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీను మరో దశలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోకి విలీనం చేస్తారని చెబుతున్నారు. గ్రామ పంచాయతీలను తొలిదశలో మున్సిపాలిటీలోకి.. ఆ తర్వాత కార్పొరేషన్‌లోకి మార్చే ప్రక్రియ మొదలు కానుందనే చర్చ కొనసాగుతోంది.

ఇస్నాపూర్ మున్సిపాలిటీ.?

ఇస్నాపూర్‌ను మున్సిపాలిటీగా మార్చాలనే ప్రతిపాదన ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో విలీనమైన గ్రామాలు పోగా మిగిలిన గ్రామాలను కొన్నింటిని కలుపుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియ కొనసాగుతుందని తెలిసింది. ఇంద్రేశం, బచ్చుగూడ, క్యాసారం, పాశమైలారం, రుద్రారం గ్రామాలతో ఇస్నాపూర్ మున్సిపాలిటీగా రూపుదిద్దుతారని చెబుతున్నారు.

వర్షార్పణం

జిల్లాలో మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలన్నీ దెబ్బతిన్నాయి. పంట పొలాలను వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం మిగిలిందని రైతన్న లబోదిబోమంటున్నాడు. జిల్లా వ్యాప్తంగా వాణిజ్య పంటలతో పాటు కొంతమేర పప్పు దినుసులు సాగు చేస్తుంటారు. పెసర, మినుము పంటలు చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేని వానలు తీవ్రంగా దెబ్బతీశాయని రైతులు వాపోతున్నారు.

ఎడతెరిపి లేని వానలు

- వందల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- కోత దశలో ఉన్న పెసర, మినుముకు తీవ్ర నష్టం
- ఆదుకోవాలంటున్న రైతులు



మినుము పంటలో నిలిచిన వర్షపు నీరు

పెసర, మినుము సాగు ఇలా..

సంగారెడ్డి జోన్ : జిల్లా వ్యాప్తంగా వానాసీజన్‌లో పెసర 13387, ఎకరాలు, మినుము 8442 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతంలో ఎక్కువగా పప్పు దినుసులు సాగు చేస్తుంటారు. ఒక ఎకరాలో వీటిని సాగు చేసేందుకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. జోరుగా వానలతో పొలాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. దీంతో పంట చేతికి వస్తుందో రాదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తు విత్తిన సమయంలో సరైన వానలు కురవలేదని, కోత దశలో ఉన్న సమయంలో అధిక వర్షాలు కురుస్తుండటంతో పంట పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని రైతులు దిగులు చెందుతున్నారు.

నష్టం అంచనా..

భారీ వర్షాలకు జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందులో పెసర 51, మినుము 170 ఎకరాల్లో నష్టం జరిగి ఉండవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం పెసర, మినుము పంటలు కోత దశలో ఉన్నాయి. వర్షాలు పడక ముందు రైతులు పంట కోసి కుప్పగా వేశారు. ఏకధాటిగా కురిసిన వానలకు పలు ప్రాంతాల్లో పంట పొలాలు నీరు నిలిచింది. అంతే కాకుండా పెసర, మినుము గింజలు రాలిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో పంటలు మొలక దశలో ఉన్నాయి. వానలు ఇలాగే కొనసాగితే పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టం వివరాలు సేకరణ

వర్షాలకు నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. పంటల వారీగా సేకరించిన వివరాలు ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ వర్షభావ పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించి, నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నష్ట పరిహారం అందించాలి



మూడు ఎకరాల్లో పెసర, నాలుగు ఎకరాల్లో మినుము పంట సాగు చేశా. వర్షం రాకముందు ఒకటిన్నర ఎకరాల్లో పెసర పంట కోశాను. మిగతా పంట నష్టం జరిగింది. నష్టం పోయిన పంటకు పరిహారం అందించాలి.

–నాగన్న పాటిల్, బర్దిపూర్ గ్రామం, ఝరాసంగం మండలం

పెట్టుబడి ఖర్చులు కూడా రావు



మూడు ఎకరాల విస్తీర్ణంలో పెసర పంట సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు చేతికొచ్చే పంట పూర్తిగా రాలిపోయి మొలకలు వచ్చాయి. పంట సాగుకు చేసిన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవు.

– నర్సింలు, పొట్టిపల్లి గ్రామం, ఝరాసంగం మండలం

వివరాలు సేకరిస్తున్నాం



కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలు సేకరిస్తున్నాం. రైతులు నష్టపోయిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటల వారీగా వివరాలు సేకరించి, ప్రతిపాదన సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సంగారెడ్డి

వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య

జోగిపేట(అందోల్): గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాల ని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య సూచించారు. పట్టణంలోని శ్రీరామ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా డీజేలపై నిషేధం విధించామని తెలిపారు. అందోల్ ఆర్డీవో పాండు, కౌన్సిలర్ చిట్టిబాబు, జోగిపేట సీఐ అనిల్ కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు మధుకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎస్ఐ పాండు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): గణపతి ఉత్సవాల్లో ఎవరికీ ఇబ్బంది కలిగించొద్దని డీఎస్పీ సత్తయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంజీ బంకేట్ హాలులో సీఐ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వినాయక చవితి, మిలాద్ ఉన్‌నబీ పండగల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, తహసీల్దార్ సరస్వతి, వైస్ చైర్మన్ చింతా గోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ స్థాయి టెన్నీ కాయిట్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లుట్లు సిద్దిపేట జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్ కుమార్‌లు తెలిపారు. టెన్నీకాయిట్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో 1 నుంచి 3 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాణించి జాతీయ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఇందులో సబ్ జూనియర్ అండర్-14 బాలుర విభాగంలో సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చందు, దినేష్, బాలికల విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెజ్జంకి విద్యార్థి తన్విక ఉన్నారు. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, విజయ, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సింగారెడ్డి శౌరిని అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీలకి శరత్‌చంద్ర..



శరత్ చంద్ర

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారుడు శరత్‌చంద్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పట్టణానికి చెందిన యువజ్యోతి ఫుట్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందిన శరత్ గతేడాది ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. దీంతో శరత్‌ను జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేసింది. బుధవారం నుంచి అస్సాంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. విద్యార్థి ఎంపికపై యువజ్యోతి అకాడమీ కోచ్ బొంతల సత్యనారాయణ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రూపేందర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

‘పిన్నింటి’కి గద్దర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రత్నం

కొమురవెల్లి(సిద్దిపేట):మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన కళాకారుడు, కవి, గాయకుడు పిన్నింటి రత్నం ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డును జనగామ జిల్లా డీఈవో రాము చేతుల మీదుగా అందుకున్నారు. మంగళవారం భాష సంస్కృత శాఖ ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలో గద్దర్ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు రావడం సంతోషకంగా ఉందన్నారు.

కాపురానికి రావడం లేని భార్యపై కత్తితో దాడి

అక్కన్నపేట(హుస్నాబాద్): భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మంచినీళ్ల బండ గ్రామానికి చెందిన బోయిని దినేశ్‌తో మల్లంపల్లి గ్రామానికి చెందిన అంజలికి ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దినేశ్ మూగ వాడు కావడంతోపాటు నిత్యం మద్యం సేవిస్తూ ఉంటాడు. అంజలి ఎవరితోనైనా మాట్లాడితే వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయంపై గత నెల 21న ఇద్దరి మధ్య గొడవ జరగగా అంజలి తల్లిగారిల్లు మల్లంపల్లికి వచ్చింది. సోమవారం అక్కడికెళ్లిన దినేశ్ కాపురానికి రావాలని భార్యపై కత్తితో దాడి చేశాడు. మంగళవారం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

పేదోడి సొంతింటి కలపై రియల్ దందా

అమ్మకంపై ఉన్న శ్రద్ధ వసతులపై కరువు

- వెల్దుర్తిలోని వెంచర్లలో అధ్వానంగా డ్రైనేజీ, పార్కులు
- అక్రమార్కులతో పంచాయతీ అధికారుల కుమ్మక్కు
- నిబంధనలకు విరుద్ధంగా తాకట్టు స్థలం రిలీజ్

లబోదిబోమంటున్న ప్లాట్ల కొనుగోలుదారులు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న పార్కు

కూలీ చేసుకుంటూ పూట గడుపుతున్న నిరుపేదకైనా..గౌరవప్రదమైన జీతం తీసుకునే ఉద్యోగికైనా.. సొంతిళ్లు అనేది ఓ కల. ఉన్నోడు.. లేనోడు అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ సొంతింటి కల నిజం చేసుకోవడానికి రాత్రింబవళ్లు కష్టపడుతుంటారు. పైసా.. పైసా కూడబెట్టి తనకున్న స్థలంలో లేక వేరే చోటో ఒక ప్లాటు కొనుగోలు చేసుకొని ఇల్లు కట్టుకుంటాడు. ఇదే అదునుగా పేదల కలను ఆసరాగా చేసుకున్న రియల్ వ్యాపారులు వారిని నిలువునా ముంచేస్తున్నారు. అన్ని రకాల హంగులతో వెంచర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటనలు ఇస్తూ జనాన్ని బురిడీకొట్టిస్తూ ప్లాట్లు అమ్ముకున్నాక పత్తాలేకుండా పోతున్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో డీటీసీపీ అనుమతులతో ఎనిమిది, ఆరెగూడెం పంచాయతీ పరిధిలో ఒకటి వెంచర్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 20 ఎకరాల్లో వేర్వేరుగా లే అవుట్‌లు ఏర్పాటు చేసినా ఇందులో ఏ ఒక్క వెంచర్‌లోనూ మౌలిక వసతుల కల్పన లేదు. వెంచర్ ఏర్పాటు చేశామా.. ప్లాట్లు విక్రయించామా..డబ్బులు సంపాదించుకున్నామా అన్నట్లు సంబంధిత నిర్వాహకులు వ్యవహరించి కొనుగోలుదారులను ఆకర్షించడానికి తూతూమంత్రంగా డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తొమ్మిది వెంచర్‌లలో పావలా వంతు భాగం మౌలిక వసతులు ఏర్పాటు చేయకున్నా పంచాయతీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 15 శాతం తనఖా స్థలాన్ని దర్జాగా రిలీజ్ చేసేశారు.

కనిపించని కనీస వసతులు

గ్రామ పంచాయతీ పరిధిలో లే అవుట్ ఏర్పాటు చేయాలంటే డీటీసీపీ, మున్సిపల్, నగరాల్లోనైతే హెచ్ఎండీఏ అనుమతి తప్పనిసరి. పంచాయతీల్లో ఏర్పాటు చేసే వెంచర్‌లలో రోడ్లు, పార్కు, డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించి లే అవుట్ స్థలంలో 10 శాతం గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. అదే విధంగా పార్కులో గ్రీనరీ, క్రీడా, వ్యాయామ పరికరాల ఏర్పాటుతోపాటు అంతర్గత రోడ్లు, ఇరువైపులా వీధి దీపాలు, తాగునీటి వాటర్ ట్యాంక్, ఆలయం, వెంచర్ స్థలాన్ని బట్టి డ్రైనేజీ నిర్మాణం వంటి కనీస వసతులను వెంచర్ నిర్వాహకులే ఏర్పాటు చేయాలి. ప్లాట్లు కొన్న వారికి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మౌలిక వసతులు పూర్తి చేసే వరకు లే అవుట్‌లో మరో 15 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరిట అదనంగా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. వెంచర్‌లో వసతులు కల్పించాక ఆ స్థలాన్ని గ్రామ పంచాయతీ అధికారి తిరిగి రిలీజ్ చేయాల్సి ఉంటుంది. కానీ మండల కేంద్రమైన వెల్దుర్తిలో పుట్టగొడుగుల్లా వెలసిన లే అవుట్‌లలో ఈ నిబంధనలు మచ్చుకైనా కనబడని పరిస్థితి.

ఇల్లు కట్టుకోలేని పరిస్థితి

డీటీసీపీ అనుమతులతో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి వారు సొంతిళ్లు కట్టుకోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు లేవు. ఓ వెంచర్‌లోనైతే డ్రైనేజీ పైపు లైన్ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తి ఆక్రమించి దర్జాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు.



మురికికూపంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ

నిబంధనలకు విరుద్ధంగా స్థలం రిలీజ్..

లే అవుట్ అనుమతులతో వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఎనిమిది వెంచర్‌లలో 20 శాతం మౌలిక వసతులు పూర్తి చేయకున్నా పంచాయతీ కార్యదర్శి ఆరు వెంచర్‌లకు సంబంధించిన 15 శాతం తాకట్టు స్థలాన్ని రిలీజ్ చేశాడు. పార్కులో గ్రీనరీ ఏర్పాటు చేయకపోవడంతో నేడు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. డ్రైనేజీకి అవుట్‌పుట్ లేక మురుగునీరంతా ఖాళీ ప్లాట్లలోనే నిలిచిఉంటుంది. మౌలిక వసతులు పూర్తయ్యేవరకు పంచాయతీ ఆధీనంలో ఉండాల్సిన తాకట్టు స్థలాన్ని వెంచర్ నిర్వాహకులతో చేతులు కలిపి పంచాయతీ కార్యదర్శి దర్జాగా రిలీజ్ చేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు



“ వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుంటున్న వారు ప్రస్తుతం మౌలిక వసతుల కల్పనపై ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంది. వెంచర్ నిర్వాహకులు ప్లాట్లు విక్రయించుకొని పత్తాలేకుండా పోవడం, ఇంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇస్తున్న పంచాయతీ అధికారులు సమస్యలపై తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అరకొర వసతులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న వెంచర్ నిర్వాహకులతో పాటు వారికి సహకరించిన పంచాయతీ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

-బాలరాజు, ప్లాట్ కొనుగోలుదారుడు

ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలి



న్యాల్‌కల్-ముంగి రోడ్డుపై ఆందోళన చేస్తున్న ఫార్మాసిటీ భూ నిర్వాసితులు, రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్):ఫార్మాసిటీ ఏర్పాటును నిరసిస్తూ మండల పరిధిలోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల భూ నిర్వాసితులు, రైతులు ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని కోరుతూ మంగళవారం న్యాల్‌కల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీ నుంచి ర్యాలీగా వెళ్లి రోడ్డుపై, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కొంతసేపు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అక్కడకు చేరుకొని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నిరసన తెలుపుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ భూపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్గి, డప్పూర్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు మారుతి యాదవ్, రవి, శివరాజ్ పాల్గొన్నారు.

బలవంతంగా భూసేకరణ చేయొద్దు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఫార్మాసిటీ పరిశ్రమల క్లస్టర్‌తో వ్యవసాయ భూములతో పాటు మంజీరా నది కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్‌కల్ మండలం డప్పూర్, వడ్డీ, మల్గి గ్రామాలలో ఫార్మా కంపెనీ కోసం భూసేకరణను ఆ ప్రాంత రైతులు వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారని, వారి పోరాటానికి కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఫార్మా క్లస్టర్ కోసం 2300 ఎకరాల భూమి సేకరించినందుకు ప్రయత్నిస్తుందని, ఇందులో 900 ఎకరాలు పేదల అసైన్డ్ భూములే ఉన్నాయన్నారు. ఎం.యాదగిరి, దాస్, దత్తు పాల్గొన్నారు.

గంజాయి కేసులో..

- నిందితుడికి ఐదేళ్ల జైలు

జోగిపేట(అందోల్): గంజాయి తరలింపునకు సంబంధించి కేసు విచారణలో భాగంగా నిందితుడికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధించింది. జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి కథనం మేరకు.. విశాఖ పట్టణానికి చెందిన గార సత్యనారాయణ 2019లో ఆర్టీసీ బస్సులో 10 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా సంగారెడ్డి ఫస్ట్ అడిషనల్ సెషన్ కోర్టు మెజిస్ట్రేట్ కే.జయంతి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

గజ్వేల్‌రూరల్: చోరీ కేసులో ముగ్గురికి కోర్టు శిక్ష విధించినట్లు గజ్వేల్ సీఐ సైదా మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. నెల రోజుల కిందట గజ్వేల్ పట్టణంలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టాం. మహారాష్ట్రకి చెందిన కోటకూరి ప్రశాంత్‌రెడ్డి, మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ఎం.శివశంకర్, హైదరాబాద్‌లోని మంగళహాట్‌కు చెందిన యాదగిరి గజ్వేల్ పట్టణంలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు గుర్తించాం. వీరిలో ప్రశాంత్‌రెడ్డి రెండు చోరీల్లో, శివశంకర్, యాదగిరి ఒక్కో చోరీలో కేసులు నమోదు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించాం. కాగా ట్రయల్ కోర్టులో ఈ ముగ్గురు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో ప్రశాంత్‌రెడ్డికి ఏడాది జైలు, శివశంకర్, యాదగిరికి ఆరు నెలల చొప్పున జైలు విధిస్తూ గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య తీర్పునిచ్చారు.



పెసర పంటలో క్షేత్ర ప్రదర్శన చేస్తున్న అధికారులు

నూతన సాగు వైపు మొగ్గు చూపాలి

- జిల్లా వ్యవసాయాధికారి రాధిక
- తోర్నాలలో విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా రైతులు పంట వైవిధ్యీకరణ వైపు మొగ్గు చూపేలా చూడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో ఉత్తమ సాగు పద్ధతులపై రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, అధికారులతో చర్చాగోష్టి నిర్వహించారు. మొదటగా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రను గురించి వివరించారు. నాటి నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయం నుంచి రూపొందించిన వంగడాలు, సాంకేతిక అంశాలను తెలియజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక మాట్లాడుతూ.. పంటల వైవిధ్యీకరణ వైపు రైతులు మొగ్గు చూపేలా చైతన్యం చేయడంతోపాటుగా వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం పెసర ఎంజీజీ-385 రకం సాగును రైతులు, విద్యార్థుల సమక్షంలో క్షేత్ర ప్రదర్శన చేశారు. అనంతరం పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి, లింగార్షక బుట్టలు, వేపనూనెలను అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.శ్రీజయ, డా.పల్లవి, డా.ఉమారాణి, డా.శ్వేత, సతీష్, రాజా, పలు గ్రామాల రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వేపనూనె, లింగార్షక బుట్టలను అందిస్తున్న అధికారులు

రేషన్ బియ్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు

పౌర సరఫరాల శాఖ ఓఎస్‌డీ ద్రోణాచార్య

గజ్వేల్‌రూరల్: పౌర సరఫరాల దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ ఓఎస్‌డీ ద్రోణాచార్య హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ (షాపు నంబర్ 8, 9, 33, 36) దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 6 బృందాలు తనిఖీలు చేపడుతున్నాయన్నారు. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన బియ్యాన్ని సక్రమంగా ప్రజలకు పంపిణీ చేస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. రేషన్ దుకాణాల్లోని బియ్యాన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే చర్యలు తప్పవని, ప్రజలు రేషన్ బియ్యాన్ని విక్రయించొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, టెక్నికల్ అసిస్టెంట్ విజయ భూషణ్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావులతోపాటు గజ్వేల్ ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చేర్యాల(సిద్దిపేట): పట్టుకున్న బియ్యంతో పోలీసులు

ఎనిమిది క్వింటాళ్ల బియ్యం పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం అందింది. పట్టణ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మాలోత్ జితేందర్‌తోపాటు ఆటోను స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఆర్డీఓ, తహసీల్దార్లతో ఎమ్మెల్యే అత్యవసర సమీక్ష

నారాయణఖేడ్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీఓ అశోక చక్రవర్తితోపాటు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో మంగళవారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. కాంజీపూర్, అనంతసాగర్, నమ్లిమేట్ సమీపాల్లో వంతెనల నిర్మాణం కోసం ఎఫ్ఆర్ కింద ప్రతిపాదనలు పంపామన్నారు. ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టాలని, వారికి పరిహారం కోసం ప్రదిపాదనలు పంపించాలని సూచించారు. కుల, ఆదాయ, మరణ, సక్సేషన్ ధ్రువపత్రాల జారీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫాంల్యాండ్స్ లేఅవుట్ల విషయంలో నిబంధనలు అమలయ్యేలా చూసి రిజిస్ట్రేషన్లకు అనుమతించాలన్నారు. ఇండస్ట్రియల్ క్లస్టర్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీల భర్తీకి డీఈఓతో ప్రభుత్వానికి లేఖ రాయించానన్నారు. గురుకులాలు, పాఠశాలలు కురుస్తున్నందున మరమ్మతులకు వివరాలు పంపాలని ఎంఈఓలకు సూచించామన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

చందాపూర్.. రాకపోకలు బంద్

చందాపూర్.. ఇరవై దాకా గృహాలతో ఒక చిన్న పల్లె. భారీ వర్షాలొస్తున్నాయంటే ఆ ఊరి జనం హడలిపోతారు. రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోతాయని భయపడతారు. సుదీర్ఘకాలం నుంచి ఈ పరిస్థితి ఎదుర్కొంటున్న ఆ పల్లె జనం హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ బాధలు తీర్చేదెవరా అని ఎదురుచూస్తున్నారు. రూ.85 లక్షల నిధులు మంజూరైనా పనులు అగ్రిమెంట్‌కే పరిమితమయ్యాయి.

- వరద తాకిడికి కొట్టుకుపోయిన పల్లె రోడ్డు
- గతంలోనే హై లెవెల్ బ్రిడ్జి మంజూరు
- నిధులున్నా ముందుకు సాగని పనులు
- గండిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): తూప్రాన్-గజ్వేల్ రహదారిపై ఉన్న బొర్రగూడెం స్టేజీ నుంచి చందాపూర్ గ్రామం 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 20 వరకు ఇళ్లు ఉన్నా యి. చందాపూర్ రోడ్డు మార్గంలో ఉన్న చెక్‌డ్యాం అలుగు, వరద నీరు వెళ్లేందుకు చిన్నచిన్న పైపులతో కల్వర్టు నిర్మించారు. ఐదారేళ్లుగా వరద ఉధృతి పెరిగిన ప్రతీసారి రోడ్డు కొట్టుకుపోతుంది. తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. మళ్లీ వర్షాలు పడితే షరా మామూలే. తాజాగా మంగళవారం వరద తాకిడికి మళ్లీ రోడ్డు కల్వర్టు కొట్టుకుపోయింది. చందాపూర్ వాసులు ఊరు దాటే మార్గానికి మూతపడింది.

‘హై లెవెల్ బ్రిడ్జి’ అగ్రిమెంట్‌కే పరిమితం

బొర్రగూడెం-చందాపూర్ మార్గంలో చెక్‌డ్యాం వరద తాకిడికి రోడ్డు కొట్టుకుపోతుండటంతో శాశ్వత పరిష్కారం దిశగా ‘హై లెవెల్ బ్రిడ్జి’ నిర్మాణానికి రూ.85 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనుల కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ టెండర్ నిర్వహించింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో సెప్టెంబర్ 27, 2023న అధికారులు అగ్రిమెంట్ చేయించుకొని పనులు అప్పగించారు. దీని ప్రకారం మార్చి 26, 2024 వరకు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని నిర్దేశించారు. గడువు దాటి ఐదు నెలలైనా అక్కడ పనులు మాత్రం కార్యరూపం దాల్చలేదు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫైనల్ నోటీస్ కూడా జారీ చేశారు.

రోడ్డును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే..

వరద తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డును మంగళవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పరిశీలించారు. అక్కడి గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. అక్కడి నుంచే పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ ప్రభాకర్‌తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టాలని, రాకపోకలు పునరుద్ధరించాలని సూచించారు.



గండి పడిన తీరును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

ఉధృతంగా మోయతుమ్మెద వాగు



కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ వద్ద ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో హనుమకొండ-సిద్దిపేట ప్రధాన రహదారిపై మరోసారి మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మూడో రోజు వాహనాల రాకపోకలు నిలిపివేశారు.బస్వాపూర్ నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా హుస్నాబాద్ వైపు వాహనాల దారి మళ్లించారు. కాగా లో లెవల్ వంతెన కూల్చి వేసి హై లెవల్ వంతెన నిర్మిస్తున్నారు.నిర్మాణం పూర్తి అయితే సమస్య తీరుతుంది.

మా బాధలు పట్టించుకోండి



వరద వచ్చినపుడల్లా మా రోడ్డు కొట్టుకుపోతుంది. ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వరద తగ్గి తాత్కాలిక మరమ్మతులు చేసే వరకు ఎక్కడికి వెళ్లలేకపోతున్నాం. రోగాలు, నొప్పులతో బాధపడే వారున్నా, గర్భిణులు ఉన్నా, ముందు జాగ్రత్తగా వరదలకు ముందే ఊరు దాటించాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి ఈ సమస్య మమ్ములను వేధిస్తుంది. ప్రభుత్వం దృష్టి సారించి పై వంతెన నిర్మించాలి.

– చందాపూర్ గ్రామ మహిళలు

తాత్కాలిక మరమ్మతులు చేపడతాం

చందాపూర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి అగ్రిమెంట్ గడువు ముగిసింది. మార్చిలోనే పనులు పూర్తి కావాలి. కాంట్రాక్టర్‌కు ఫైనల్ నోటీసు కూడా జారీ అయింది. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రాకపోకలు పునరుద్ధరించేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపడతాం.

– ప్రభాకర్, డిప్యూటీ ఈఈ, పంచాయతీరాజ్ విభాగం

జాలరి మృతదేహం లభ్యం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి కల్వర్టులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన సందిరి లక్ష్మణ్(45) మృతదేహం మంగళవారం కాల్వలో లభ్యమైంది. సిద్దిపేట సీఐ శ్రీను, బెజ్జంకి ఎస్ఐ క్రిష్టారెడ్డిలు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో మూడు రోజులుగా వెతుకుతుండగా కల్వర్టు నుంచి వచ్చే కాల్వలో లక్ష్మణ్ మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు శ్రవణ్ ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణ్ ఉపాధి పనులకు వెళ్తుండగా ఇంటి వద్ద తన భార్య పచారి దుకాణం నిర్వహిస్తుంది. వర్షం కురుస్తున్నప్పటికీ జాలరి లక్ష్మణ్‌ను వెతికేందుకు కృషి చేసిన ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను, ఆర్‌డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ క్రిష్టారెడ్డి, ఫైర్, స్థానిక మత్స్యకారుల సొసైటీ సభ్యులకు మాజీ సర్పంచ్ నర్సింగారావు కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష్మణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు